
సాక్షి విశాఖపట్నం

సోమవారం । 3 । మార్చి । 2025



కళా వైభవం

బీచ్‌రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ టెంపుల్‌లో ఆదివారం సాయంత్రం విదేశీ కళాకారులు వామనదేవుని అవతారం నాటకాన్ని ప్రదర్శించారు. తమ ప్రతిభాపాటవాలతో నాటకాన్ని రక్తికట్టించారు. 8లో



న్యూస్‌రీల్

మహిళా దినోత్సవం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య రాజశేఖర్

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం దుర్గా భాయ్ దేశముఖ్ మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం వైస్ చాన్సలర్ ఆచార్య జీపీ రాజశేఖర్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. విద్యార్థులను భాగస్వామ్యం చేస్తూ కార్యక్రమాలను నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్రీడలు, సాంస్కృతిక, మేధో అంశాలలో పోటీలను నిర్వహిస్తున్నామని కేంద్రం సంచాలకులు ఆచార్య ఎ. పల్లవి వివరించారు. మార్చి 6,7 తేదీల్లో ఈ కార్యక్రమాలు ఉం నిర్వహిస్తామని ఆమె వీసీకి వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఈఎస్ ధనుంజయ రావు తదితరులు పాల్గొన్నారు.


వన్యప్రాణులపై పోస్టర్ ప్రదర్శన పోటీలు



పోస్టర్ల ప్రదర్శన తిలకిస్తున్న చిన్నారులు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో ఆదివారం ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జూ అధికారులు విద్యార్థులకు అవగాహన కోసం ఒకటో తరగతి నుంచి పీజీ వరకు వన్యప్రాణులపై పోస్టర్ ప్రదర్శన పోటీలు నిర్వహించారు. వారికి కేటగిరీల వారీగా అప్పగించిన అంశాలపై ఇంటి వద్దే పోస్టర్లు సిద్ధం చేసుకొని జూ బయోస్కోప్‌లో జరిగిన పోటీలకు హాజరయ్యారు. నగరంలోని పలు పాఠశాలలు, కళాశాలల నుంచి సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొని వారి ప్రతిభ చూపారు. పోస్టర్లను తోటి విద్యార్థులు, అతిథులు, జూ సందర్శకులు ఆసక్తిగా తిలకించారు. ఉత్తమ పోస్టర్లు ప్రదర్శించిన విద్యార్థులకు ముఖ్య అతిథి ఏయూ జంతు శాస్త్ర విభాగం అధ్యాపకురాలు డాక్టర్ సి.మంజులత, జూ క్యూరేటర్ బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో జూ అసిస్టెంట్ క్యూరేటర్లు గోపి, గోపాలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కుడో బెల్ట్ గ్రౌండింగ్ టెస్ట్‌కు 40 మంది హాజరు



కుడో బెల్ట్ గ్రౌండింగ్ టెస్ట్‌కు హాజరైన క్రీడాకారులు

పరవాడ: ఆంధ్రప్రదేశ్ కుడో అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖ స్టీల్ ప్లాంట్ త్రిష క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహించిన కుడో బెల్ట్ గ్రౌండింగ్ టెస్ట్‌కు వివిధ ప్రాంతాల నుంచి 40 మంది విద్యార్థులు పాల్గొన్నారని అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.శశిధర్ తెలిపారు. కుడో బెల్ట్ గ్రౌండింగ్ టెస్ట్‌కు రావాడ శివారు రేకవానిపాలెం గ్రామానికి చెందిన మొల్లి తులసీరావు ఎగ్జామినర్‌గా ఎంపికైనట్లు వెల్లడించారు. ఈ నెల 26, 27న కుడో కప్‌ను పరవాడలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మే 16న పూనేలో నిర్వహించనున్న 31వ జాతీయ స్థాయి కుడో కప్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎ.కిశోర్, అనకాపల్లి జిల్లా కుడో అసోసియేషన్ కార్యదర్శి పి.రమణ, కోచ్ బి.యశ్వంత్ పాల్గొన్నారు.

హార్బర్‌కు హంగులు



చురుగ్గా ఫిషింగ్ హార్బర్ మోడ్రనైజేషన్ పనులు

తాజాగా మరో 2 ఫిషింగ్ జెట్టీలు నిర్మాణానికి శ్రీకారం

రూ.32.61 కోట్లతో జెట్టీలతో పాటు వార్ఫ్ నిర్మాణ పనులు అప్పగింత

ఏడాదిలోగా నిర్మించేలా కాంట్రాక్టు సంస్థతో ఒప్పందం





ఫిషింగ్ హార్బర్

చేపలు ఎండబెట్టుకునే యార్డు, నిల్వ చేసుకునే గదులు, క్యాంటీన్ నిర్మాణ పనులు

సాక్షి, విశాఖపట్నం: అశల తీరంలో బతుకు నావలో బిక్కుబిక్కుమంటూ జీవనం వెళ్లదీసే గంగపుత్రుల జీవితాలకు దారి చూపించేలా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చొరవతో విశాఖపట్నం పోర్టు అథారిటీ హార్బర్ ఆధునికీకరణ పనులు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం సాగరమాల పథకంలో భాగంగా.. రూ.151.81 కోట్లతో పనులు జోరుగా సాగుతున్నాయి. దళారుల చేతిలో మోసపోతూ.. ఆర్థికంగా ఎదగలేకపోతున్న మత్స్యకారులకు లాభాలు అందించేలా ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ జరుగుతోంది. ఇప్పటికే పలు పనులు చివరి దశకు చేరుకోగా.. తాజాగా మరో రెండు ఫిషింగ్ జెట్టీల నిర్మాణానికి పోర్టు శ్రీకారం చుట్టింది. రూ.32.61 కోట్లతో జెట్టీల నిర్మాణ పనులను ఖరారు చేసింది. ఏడాదిలోగా నిర్మించి.. మత్స్యకారులకు లబ్ధి చేకూరేలా జెట్టీల ఏర్పాటుకు చకచకగా అడుగులు పడుతున్నాయి.

రెండేళ్ల క్రితం ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా వర్చువల్ విధానంలో ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ పనులు ప్రారంభమయ్యాయి. ఇందుకోసం రూ.151.81 కోట్లు వెచ్చించేందుకు విశాఖపట్నం పోర్టు ముందుకువచ్చింది. అందులో రూ.50 కోట్లు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద మంజూరు చేశారు. మరో రూ.50 కోట్లు సాగరమాల కింద కేంద్ర నౌకాయానశాఖ ఇచ్చింది. పీపీపీ ప్రాజెక్టుల ద్వారా రూ.27.55 కోట్లు సమకూర్చుకోనున్నారు. విశాఖపట్నం పోర్టు తొలుత రూ.24.26 కోట్లు ఇస్తామని ప్రకటించింది. అయితే మత్స్యకారులు వసతులు పెంచాలని, ఫింగర్ జెట్టీలు కావాలని, వలలు అల్లుకోవడానికి భవనం నిర్మించాలని డిమాండ్ చేయడంతో మరో రూ.26.7 కోట్లు సమకూర్చడానికి విశాఖపట్నం పోర్టు ముందుకువచ్చింది. దీంతో పోర్టు వాటా రూ.50.96 కోట్లకు చేరింది. మత్స్యకారులకు మరిన్ని ప్రయోజనాలు చేకూర్చేలా హార్బర్ అభివృద్ధి జరగాలంటూ అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించడంతో 2023లో డీపీఆర్‌లో స్వల్పమార్పులు చేపట్టారు. ముందుగా ప్రతిపాదించిన 3,4,5 జెట్టీలకు బదులు జీరో జెట్టీకి సమాంతరంగా ఫ్లోటింగ్ జెట్టీని నిర్మించాలని, అదేవిధంగా చేపల వేలం, ప్యాకింగ్ ప్రాంతాల్లో కట్టడాల్ని తొలగించి.. మరో జెట్టీని ఏర్పాటు చేసేలా డీపీఆర్‌లో మార్పులు చేపట్టారు. దానికనుగుణంగా తాజాగా నిర్మాణ ప్రక్రియకు అడుగులు పడుతున్నాయి.



రూ.32.61 కోట్లతో రెండు జెట్టీల నిర్మాణం

ఇటీవలే ఫిషింగ్ జెట్టీల నిర్మాణానికి విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ) టెండర్లు పిలిచింది. ఈ టెండర్లను ఆర్‌కేఈసీ ప్రాజెక్టు లిమిటెడ్ సంస్థ దక్కించుకుంది. రూ.32,61,42,763తో రెండు ఫిషింగ్ జెట్టీల నిర్మాణంతో పాటు వార్ఫ్ కూడా నిర్మించేలా టెండర్లు ఖరారు చేశారు. ప్రస్తుతం ఉన్న ఫింగర్ జెట్టీల మధ్యలో అంటే.. నాలుగో నంబరు జెట్టీ నుంచి 11వ నంబరు జెట్టీ వరకు వార్ఫ్ నిర్మాణం జరగనుంది. చేపల లోడింగ్, అన్‌లోడింగ్‌కు అనుగుణంగా ఈ వార్ఫ్ ఏర్పాటు కానుంది. అదేవిధంగా ప్రస్తుతం హార్బర్‌లో 11 ఫిషింగ్ జెట్టీలున్నాయి. 10 జెట్టీలు మత్స్యకారులు వినియోగిస్తుండగా.. చివరిదైన 11వ జెట్టీని కోస్ట్‌గార్డ్‌తో పాటు మత్స్యకారులు సంయుక్తంగా వినియోగిస్తున్నారు. ఇప్పుడు ఈ జెట్టీ పక్కన మరో రెండు నిర్మాణం కానున్నాయి. ఏడాదిలోపు నిర్మాణం పూర్తి చేసేలా నిబంధనలు విధిస్తూ పనుల్ని ఆర్‌కేఈసీ సంస్థకు అప్పగించారు. ఈ రెండూ అందుబాటులోకి వస్తే.. 11వ జెట్టీని పూర్తిగా కోస్ట్‌గార్డ్ వినియోగించుకుంటుంది. మత్స్యకారులు మాత్రం 12 జెట్టీలను వాడుకునే అవకాశం లభిస్తుంది.

సకల సౌకర్యాల హార్బర్

డిమాండ్‌కు అనుగుణంగా వసతుల కల్పనే హార్బర్ ఆధునికీకరణ ప్రధాన ధ్యేయంగా పనులు సాగుతున్నాయి. వేలం హాళ్లు, ప్యాకింగ్ యూనిట్, పార్కింగ్ ఏరియా, ఆఫీసుకు ప్రత్యేక సదుపాయం, రెస్ట్ రూమ్, క్యాంటీన్, చేపలు ఎండబెట్టుకోవడానికి పరిశుభ్రమైన యార్డులు, చేపలు నిల్వ చేసుకునే సదుపాయం, ఫ్లోటింగ్ జెట్టీలు, వాటికి రిటైనింగ్ గోడలు, మురుగునీటిని శుద్ధిచేసే ప్లాంటు, అంతర్గత రహదారులు, అండర్ గ్రౌండ్ రిజర్వాయర్, ఓవర్ హెడ్ ట్యాంక్, సోలార్ విద్యుద్దీపాల ఏర్పాటు పనులు తుది దశకు చేరుకున్నాయి. పనులన్నింటిని ఏడు దశలుగా విడదీసి వర్క్ ఆర్డర్లు అప్పగించారు. అదనంగా మరో వేలం హాలు నిర్మించనున్నారు. కొత్త వేలం హాలును ఏసీ సదుపాయంతో ఏర్పాటు చేసేలా నిర్మాణం సాగుతోంది. బోట్ల నుంచి దించిన చేపలు, రొయ్యలను వేలం హాళ్లకు కన్వేయరు బెల్టుల ద్వారా పంపే ఏర్పాట్లూ రానున్నాయి. దించి,ఎత్తడం వల్ల సముద్ర ఉత్పత్తులు పాడైపోకుండా ఈ సదుపాయం కల్పిస్తున్నారు. పోర్టుకు చెందిన 10 ఎకరాల స్థలంలో కోల్డ్ స్టోరేజ్ రాబోతోంది. దీన్ని పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంతో.. నిర్ణీత ధరలతో నిర్వహించేలా నిర్మించాలని పోర్టు అధికారులు భావిస్తున్నారు. అదేవిధంగా ప్రస్తుతం ఫిషింగ్ హార్బర్ వద్ద ప్రైవేట్ ప్రాసెసింగ్ ప్లాంట్స్ ఉన్నాయి. ఈ ప్రైవేట్ వ్యాపారులు నిర్ణయించిన ధరలకే అమ్ముకోవాల్సి వస్తోంది. అందుకే.. ప్రత్యేకంగా ప్రాసెసింగ్ ప్లాంట్ కూడా రాబోతోంది. బోట్లు మరమ్మతులు చేసుకునేందుకు ప్రత్యేక రిపేరింగ్ సెంటర్ కూడా నిర్మించనున్నారు. ప్రస్తుతం 24 హెక్టార్లలో ఉన్న ఫిషింగ్ హార్బర్‌లో ఆధునిక మౌలిక సదుపాయాలు కల్పిస్తు ప్రపంచస్థాయి ప్రమాణాలకు అనుగుణంగా మోడ్రన్ హార్బర్‌గా త్వరలోనే మారనుందని పోర్టు అధికారులు చెబుతున్నారు.



ఇక్కడే రెండు ఫిషింగ్ జెట్టీలు రాబోతున్నాయి

‘ఓపెన్ వ్యాపారం’పై కలెక్టర్ సీరియస్

సాక్షి ఎఫెక్ట్..

విశాఖ విద్య: సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో సోమవారం నుంచి ప్రారంభయ్యే ఇంటర్ పరీక్షల నిర్వహణలో లోపాలపై కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆరా తీశారు. ‘ఓపెన్ వ్యాపారం’ అనే శీర్షికన ఆదివారం ‘సాక్షి’లో ప్రచురితమైన కథనం విద్యాశాఖ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. దీనిపై కలెక్టర్ సైతం స్పందించారు. ఓపెన్ ఇంటర్మీడియెట్ పరీక్ష కేంద్రాలు ఎక్కడ జరుగుతున్నాయనే వివరాలను విద్యాశాఖాధికారులను అడిగి తెలుసుకున్న ఆయన.. మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తాను కూడా పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని, కేంద్రాల లొకేషన్ వివరాలను అందజేయాలని ఆదేశించినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా, ఆనందపురం, భీమిలి, పెందుర్తి కేంద్రాల్లో ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు లేకుండానే, తప్పుడు పద్ధతిలో అడ్మిషన్లు చేసినట్లుగా తెలుస్తోంది. అడ్మిషన్లు జరిగిన తీరును, ఓ ప్రత్యేకాధికారితో పరిశీలించినట్టయితే, ఏజెంట్లు చేసిన విద్యా వ్యాపారం వెలుగులోకి వస్తుందని కొన్ని స్టడీ సెంటర్ల నిర్వాహకులు చెబుతున్నారు. ఓపెన్ ఇంటర్ పరీక్షల కేంద్రాలను తాను కూడా ఆకస్మికంగా తనిఖీ చేసిన మాస్ కాపీయింగ్‌కు అడ్డుకట్ట వేస్తానని విద్యాశాఖ ఆర్జేడీ విజయ భాస్కర్ తెలిపారు.

శివరాత్రి ప్రత్యేక బస్సుల ద్వారా రూ. 2 కోట్ల ఆదాయం

మధురవాడ: మహాశివరాత్రి సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడపడం ద్వారా విశాఖ డిపోనకు రూ.2 కోట్లు ఆదాయం సమకూరిందని జోన్-1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏ.విజయ్‌కుమార్, రీజినల్ మేనేజర్ అప్పలనాయుడులు చెప్పారు. ఆదివారం మధురవాడ డిపోలో అన్ని విభాగాలను వీరు తనిఖీ చేశారు. ఈ నెల 5, 6 తేదీల్లో గీతం యూనివర్సిటీలో నిర్వహించే జాబ్‌మేళాకు ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజినీర్ రాజేశ్వరి, ట్రాఫిక్ సూపర్‌వైజర్ దుర్యోధనుడు పాల్గొన్నారు.

‘వినదగునెవ్వరు చెప్పిన..’ పుస్తకావిష్కరణ



చాగంటి రచించిన వినదగు నెవ్వరు చెప్పిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య సోమరాజు

మధురవాడ: ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త, ఏపీ రాష్ట్ర ప్రభుత్వ విద్యార్థుల నైతిక విలువల సలహాదారు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరావు రచించిన వినదగునెవ్వరు చెప్పిన పుస్తకాన్ని గాయిత్రి విద్యాపరిషత్ కార్యదర్శి ఆచార్య సోమరాజు ఆదివారం సాయంత్రం మధురవాడ గాయత్రి విద్యాపరిషత్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సంపూర్ణ శ్రీరామాయణ ప్రవచన వేదికపై ఆవిష్కరించారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించడం కోసం ఆయన 116 సంచికలుగా రచించిన పుస్తకాన్ని విజయవాడ ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న ఎమెస్కో సంస్థ ముద్రించింది. ప్రథమ ప్రతిని అష్టలక్ష్మి దేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణ కొనుగోలు చేశారు. కంచి కామకోటి 68వ పీఠాధిపతి చంద్రశేఖరేంద్ర సరస్వతి మహా స్వామి మొదలు మహాత్మా గాంధీ, స్వామి వివేకానంద, దేవుల పల్లి కృష్ణశాస్త్రి, రవీంద్రనాథ్ ఠాగూరు వంటి మహామహులు చెప్పిన పిల్లలకు ఉపయోగపడే అంశాలకు వారు వ్యాఖ్యానాలు చేస్తూ రచించారు. కార్యక్రమంలో ఎమెస్కో ప్రచురణ సంస్థ అధినేత విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పట్టం ఎవరికి..!



నేడు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు

- ప్రథమ ప్రాధాన్యత ఓటుపైనే అందరి ఆశలు
- గెలుపుపై ధీమాతో అభ్యర్థులు
- మొదటి ప్రాధాన్యత ఓటుతో తేలితే ఫలితం సాయంత్రం 5 గంటల్లోపే..
- లేదంటే రాత్రి 9 గంటలు దాటే అవకాశం
- ఉత్కంఠలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయులు

మొత్తం టేబుల్స్ 20

కౌంటింగ్ స్టాఫ్ 40 మంది

మొత్తం ఓట్లు 22,493

పోలైన ఓట్లు 20,795

మొత్తం బ్యాలెట్ బాక్సులు 123

బరిలో ఉన్న అభ్యర్థులు 10 మంది

లెక్కింపు ప్రారంభం ఉదయం 8 గంటలకు

సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయులు.. ఎన్నికల పరీక్షల్లో ‘ఫస్ట్’ మార్కు ఎవరికి ఇచ్చారో.. మరికొద్ది గంటల్లోనే తేలనుంది. టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలైన ఓట్ల లెక్కింపునకు ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ సిద్ధమైంది. 10 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని ఉపాధ్యాయులు గత నెల 27 బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తం చేశారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సుదీర్ఘంగా సాగే ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు.. బాగా ఆలస్యమయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. మొదటి ప్రాధాన్యత ఓటుతో ఫలితం తేలితే.. సాయంత్రం 5 గంటలకల్లా విజేతను ప్రకటించే అవకాశం ఉంది. లేదంటే.. రాత్రి 9 లేదా 10 గంటలకు ఫలితం డిక్లేర్ అవుతుందని అంచనా వేస్తున్నారు. ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ ట్రిపుల్‌ఈ విభాగం భవనంలో ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. మొత్తం 3 దశల్లో ఈ ప్రక్రియ జరగనుంది. ఎన్నికల బరిలో ఉన్న 10 మంది అభ్యర్థుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్ సీల్స్ తొలగించి.. బ్యాలెట్ బాక్సుల్ని హాల్‌లోకి తీసుకొస్తారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరిసీతారామరాజు, విశాఖపట్నం జిల్లాలకు సంబంధించి మొత్తం 123 బ్యాలెట్ బాక్సులు ఉన్నాయి. లెక్కింపు కోసం 20 బల్లలు ఏర్పాటు చేశారు. ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం 22,493 మంది ఓటర్లున్నారు. వీరిలో 20,795 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

మూడు దశల్లో ప్రక్రియ సాగుతుందిలా.


సార్వత్రిక ఎన్నికల కంటే భిన్నంగా లెక్కింపు ప్రక్రియ ఉంటుంది. మొత్తం మూడు దశల్లో జరగనుంది. మొదటి దశలో 123 బాక్సుల్లో ఉన్న ఓట్లను బయటికి తీస్తారు. మొత్తం ఆరు రౌండ్లుగా విభజించి ఓట్లను బయటికి తీసేనాటికి 11 గంటల సమయం పట్టే అవకాశం ఉంది. తర్వాత దశలో పోలైన ఓట్లను 25 చొప్పున ఒక కట్టగా కడతారు. ఇలా కట్టల్లో వెయ్యి ఓట్లు అయితే వాటిని ఒక డ్రమ్‌లో వేస్తారు. మొత్తం ఓట్లను వివిధ డ్రమ్ముల్లో వెయ్యి చొప్పున వేస్తారు. ఈప్రక్రియ ముగిసే నాటికి మధ్యాహ్నం 2 గంటలయ్యే సూచనలున్నాయి. భోజన విరామం తర్వాత చివరి దశలో పోలైన ఓట్ల లెక్కింపు జరుగుతుంది. తొలిగా మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహిస్తారు. ఈ ప్రక్రియలో విజేత ఎవరో తేలితే ప్రక్రియ ముగిసినట్లే. తొలి ప్రాధాన్యత ఓటుతో విజేత తేలితే.. సాయంత్రం 5 గంటలకల్లా ఫలితం ప్రకటిస్తారు. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపునకు వెళ్తే మాత్రం 9 గంటలు దాటే అవకాశం ఉంది.

గెలుపుపై ధీమా..

మొత్తం 10 మంది అభ్యర్థులు బరిలో ఉన్నా.. పోటీ మాత్రం ముగ్గురి మధ్యనే కొనసాగుతోంది. పీఆర్‌టీయూ తరపున గాదె శ్రీనివాసులునాయుడు విజయం సాధిస్తారనే ధీమా అందరిలో ఉంది. అయితే అధికార పార్టీలైన టీడీపీ, జనసేన బలపరిచిన ఏపీటీఎఫ్ అభ్యర్థి రఘువర్మ విజయం కోసం ఆ రెండు పార్టీలూ ప్రలోభాలకే ప్రథమ ప్రాధాన్యమిచ్చాయి. ఇదిలావుంటే ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి పీడీఎఫ్ అభ్యర్థిగా బరిలో దిగిన కోరెడ్ల విజయగౌరీ కూడా గెలుపుపై గట్టి నమ్మకంతో ఉన్నారు.

సగానికంటే ఒక్క ఓటు ఎక్కువ వస్తే విజేతే..

పోలైన ఓట్లలో చెల్లుబాటు అయిన ఓట్లనే పరిగణనలోకి తీసుకుంటారు. అలా ఆ ఓట్లలో సగానికంటే ఒక్క ఓటు ఎక్కువ వచ్చినా ఆ అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. ఉదాహరణకు మొత్తం పోలైన ఓట్లు 20,795 ఓట్లు కాగా.. చెల్లని ఓట్లు 795 ఉంటే.. 20,000 ఓట్లను చెల్లుబాటు ఓట్లుగా పరిగణిస్తారు. చెల్లుబాటు ఓట్లలో సగం కంటే ఒక్క ఓటు ఎక్కువగా వచ్చినా వారిని విజేతగా ప్రకటిస్తారు. అంటే.. 20 వేల ఓట్లలో 10,001 ఓట్లు తొలి ప్రాధాన్యం ఎవరికి వస్తే.. వారినే విజేతగా నిర్ణయిస్తారు. మొదటి ప్రాధాన్యత ఓటుతో ఏ అభ్యర్థి ఈ మార్క్‌ను చేరుకోకపోతే ఎలిమినేషన్ ప్రక్రియను ప్రారంభిస్తారు. గెలుపు కోటాకు సరిపడినన్ని ఓట్లు ఎవరికైతే వస్తాయో అప్పటి వరకు మిగతా ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు. ఈ విధంగా మొదటి ప్రాధాన్యత తర్వాత రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు. అయితే పోటీ చేసిన అభ్యర్థుల్లో అందరికన్నా మొదటి ప్రాధాన్యత ఓట్లు తక్కువ వచ్చిన అభ్యర్థి నుంచి ఈ ఎలిమినేషన్ ప్రక్రియ ప్రారంభం అవుతుంది. అభ్యర్థులు సాధించిన మొదటి ప్రాధాన్యత ఓట్ల జాబితాను ఎక్కువ నుంచి తక్కువకు తయారు చేస్తారు. ఇలా చివరి అభ్యర్థికి వచ్చిన ఓట్లలో రెండో ప్రాధాన్యత ఎవరికి వేశారనే ఓట్లను లెక్కించి ఆ ఓట్లను ఆయా అభ్యర్థులకు జమ చేస్తూ వస్తారు. ఇలా కింద నుంచి పై వరకు ఇదే తరహాలో లెక్కించి, ఈ ఓట్లను వారికి కలుపుతూ చివరి అభ్యర్థులను ఎలిమినేట్ చేస్తూ వెళతారు. ఒకవేళ ద్వితీయ ప్రాధాన్యత ఓట్లలోనూ మెజార్టీ ఓట్ల మార్కుకు ఏ అభ్యర్థి చేరకపోతే తృతీయ ప్రాధాన్యత ఓట్లను గణించి ఆ అభ్యర్థులకు జమ చేస్తారు. అప్పటికీ కాకపోతే నాలుగో ప్రాధాన్యం ఇలా మెజారిటీ మార్కు సంఖ్యను ఏదో ఒక అభ్యర్థి చేరేవరకు ఎలిమినేషన్ ప్రక్రియ అనేది సాగుతుంది. అందుకే అభ్యర్థుల గెలుపు ఓటముల్లో మొదటి ప్రాధాన్యంతో పాటు ఇతర ప్రాధాన్యత ఓట్లు కూడా చాలా కీలకం అవుతాయి.



జూమ్మంది ఆనందం



ఇందిరాగాంధీ జూ పార్కులో ఆదివారం సందడి నెలకొంది. సెలవు రోజు కావడంతో అధిక సంఖ్యలో సందర్శకులు తరలి వచ్చారు. వన్యప్రాణులు వాటి ఎన్‌క్లోజర్లలో హుషారుగా తిరుగుతూ అలరించాయి. పిల్లలు, పెద్దలు వాటి వద్ద సరదాగా గడిపారు. సింహం, తెల్ల పులులు, నీటి ఏనుగులు, మొసళ్లు ఎన్‌క్లోజర్లలో సందడి చేశాయి. తెల్ల పులులు సందర్శకుల సెల్ఫీలకు పోజులిచ్చాయి. సింహం ఎన్‌క్లోజర్‌లో చెట్టు ఎక్కుతూ, కిందకు జారుతూ అలరించింది. మొసళ్ల కొలనులో ఘరియల్స్ నాచు పారతో కూడిన నీటిలో పైకి తేలుతూ సందర్శకులను ఆకర్షించాయి. -ఆరిలోవ





భక్తులకు మెరుగైన సౌకర్యాలపై దృష్టి

- అధికారులకు దేవస్థానం ఇన్‌చార్జి ఈవో సుబ్బారావు దిశానిర్దేశం


ఆలయ అధికారులతో కలిసి సింహగిరిపై పర్యటిస్తున్న ఇన్‌చార్జి ఈవో సుబ్బారావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, అంకిత భావంతో పని చేయాలని సింహాచలం దేవస్థానం ఇన్‌చార్జి ఈవో కె.సుబ్బారావు అధికారులకు సూచించారు. ఈవోగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా ఆదివారం ఆయన ఇంజినీరింగ్ అధికారులు, ఆలయ అధికారులతో కలిసి సింహగిరిపై క్షేత్రస్థాయి పర్యటన చేశారు. గంగధార, రామాలయం, ప్రసాదం పథకం పనులు జరిగే ప్రదేశాలు, అన్నప్రసాద విభాగం, భక్తుల క్యూలైన్లు తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఇంజినీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. సింహగిరికి వచ్చే భక్తులు దర్శన క్యూలకు ఎటు వెళ్లాలో క్షుణ్ణంగా తెలిసేలా ఎక్కడిడక్కడ సూచన బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అన్నప్రసాద భవనంలో అన్నప్రసాదం నాణ్యతపై భక్తులను ఆరా తీశారు. ఆఖరు పంక్తిలో కూర్చునే భక్తుడి వరకు అన్నప్రసాదం రుచిగా ఉండాలన్నారు. లడ్డు ప్రసాదం రుచిలో ఎలాంటి రాజీ పడవద్దని వైష్ణవ స్వాములకు సూచించారు. పారిశుధ్యాన్ని ఎప్పటికప్పుడు మెరుగుపరచాలన్నారు. సింహగిరి ఆనంద నిలయంలో ఇంజినీరింగ్ అధికారులు, విభాగాల ఏఈవోలు, సూపరింటెండ్లతో సమావేశమై రానున్న రెండు నెలల్లో జరిగే డోలోత్సవం, పెళ్లిరాట ఉత్సవం, వార్షిక కల్యాణోత్సవం, చందనోత్సవం తదితర కార్యక్రమాలను సమష్టి కృషితో, విజయవంతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, ఏఈవో ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

38 మంది బైక్ రేసర్ల అరెస్ట్

- 38 బైక్‌లు సీజ్ చేసిన పోలీసులు


మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏడీసీపీ ప్రవీణ్‌కుమార్

బీచ్‌రోడ్డు: నగరంలో అర్ధరాత్రి బైక్ రేసులు నిర్వహించిన యువకులను పోలీసులు గుర్తించారు. కొంతకాలంగా అర్ధరాత్రి బైక్ రేసింగ్‌లతో పాదచారుల్ని, వాహనదారుల్ని ఇబ్బంది పెడుతుండటంపై స్థానికులు పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన పోలీస్ యంత్రాంగం సీసీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టి, 38 మంది బైక్ రేసర్లను అదుపులోకి తీసుకున్నట్లు ట్రాఫిక్ విభాగం ఏడీసీపీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. త్రీటౌన్ పోలీస్ స్టేషన్లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. బీచ్‌రోడ్‌తో సహా, నగరంలోని పలు ప్రాంతాల్లో అర్ధరాత్రి రేసింగ్‌ల పేరిట, ప్రమాదకరమైన స్టంట్స్ చేస్తూ పాదచారులు, వాహనదారుల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారన్న సమాచారం మేరకు దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. జోన్-1 ట్రాఫిక్ ఏసీపీ వాసుదేవరావు పర్యవేక్షణలో త్రీటౌన్, ద్వారక, నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, 38 మంది బైక్ రేసర్లను అరెస్ట్ చేసి, 38 బైక్‌లను సీజ్ చేశామన్నారు. వీరిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరిచినట్లు పేర్కొన్నారు.

లేపాక్షిలో వార్షిక క్లియరెన్స్ సేల్


రాయితీ ధరలకే హస్తకళల ఉత్పత్తులు, చేనేత వస్త్రాల ప్రదర్శన

డాబాగార్డెన్స్: నగరంలోని జగదాంబ జంక్షన్ సమీపం(కేజీహెచ్ డౌన్ రోడ్డు)లోని లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్ ఎంపోరియం వార్షిక క్లియరెన్స్ సేల్, ఉగాది డిస్కౌంట్ సేల్‌ను ప్రకటించింది. అన్ని హస్తకళలు, చేనేత వస్త్రాలపై 10–40 శాతం తగ్గింపు ధరలకే విక్రయిస్తున్నట్టు ఎంపోరియం మేనేజర్ కార్తీక్ కుమార్ పేర్కొన్నారు. ఏపీహెచ్‌డీసీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.విశ్వ ఆదేశాల మేరకు ఉగాది పండగ సీజన్లో సాటిలేని ధరలకు ప్రత్యేక కలెక్షన్లు అందించనున్నట్లు తెలిపారు. ఈ నెల 31 వరకు ఈ డిస్కౌంట్ సేల్ ఉంటుందన్నారు. అత్యుత్తమ ధరలకు ప్రామాణిక హస్తకళ సంపద సొంతం చేసుకునే అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. విశాఖ నగర పరిధి రాంనగర్ వీఎంఆర్‌డీఏ కాంప్లెక్స్, విమానాశ్రయం వద్ద గల లేపాక్షి ఎంపోరియంలో కూడా ఈ డిస్కౌంట్ సేల్ అమల్లో ఉందని కార్తీక్‌కుమార్ వెల్లడించారు.

కబేళా కథ.. మళ్లీ మొదటికి


అనధికార స్టాక్ పాయింట్‌లో నిలిపిన మేకలు, గొర్రెలు

- ముదురుతున్న కొమ్మాది కబేళా వ్యవహారం
- ఎటూతేలని గొర్రెలు, మేకల సంత వసతి
- వివిధ ప్రాంతాల రైతులు, కాపరుల ఆవేదన

కొమ్మాదిలో మేకల సంత వ్యవహారం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది. విశాఖ రూరల్ మండలం ఓజోన్ వ్యాలీ రోడ్డులోని సేవానగర్ జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ వెనుక కొన్నేళ్లుగా కొనసాగుతున్న ఈ సంత ఇప్పుడు వివాదాల వలయంలో చిక్కుకుంది. జీవాలకు రక్షణ, రైతులు, కాపరులకు సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఆచరణకు దూరంగానే ఉండిపోయింది. వీరి నుంచి డబ్బులు వసూలు చేయడంలో చూపుతున్న శ్రద్ధ, ఆశ్రయం కల్పించడంలో చూపట్లేదని అధికారుల తీరును వ్యాపారులు ఆక్షేపిస్తున్నారు.

మధురవాడ:

వైజాగ్ ఫుడ్స్‌కు చెందిన మోడరన్ కబేళాకు గొర్రెలు, మేకలు సరఫరా చేసే రైతులు, కాపరులు వాటి బస, అమ్మకాలకు అనువైన స్థలం కోసం ఇబ్బందులు పడుతున్నారు. ప్రారంభంలో ఎక్కడ ఖాళీ ప్రదేశం ఉంటే అక్కడ అమ్మకాలు నిర్వహించేవారు. తర్వాత కొన్నేళ్లుగా మారికవలసకు చెందిన టీడీపీ నాయకుడు తనకు కావలసిన వ్యక్తికి చెందిన కొమ్మాదిలోని ఖాళీ ప్రదేశంలో అనధికార సంత ఏర్పాటు చేసి, కొంత డబ్బులు వసూలు చేసేవాడు. తాజాగా ఆ స్థల యజమాని ఖాళీ చేయించడంతో మరో వ్యక్తికి చెందిన స్థలంలో కొద్ది రోజుల నుంచి సంత నిర్వహిస్తున్నారు.


కొమ్మాది ఓజోన్ వ్యాలీ రోడ్ వద్ద అనధికార మేకలు, గొర్రెల సంత నిర్వహిస్తున్న ప్రాంతం

దీంతో ఇరు వర్గాల మధ్య వివాదం నెలకొంది. స్థానికులు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకున్నారు.

వసతి కరవై.. వ్యాపారుల ఇక్కట్లు

ప్రస్తుతం సంత జరుగుతున్న స్థలం సర్వే నెం .156/6 ప్రభుత్వ భూమి అని, అది కోర్టు వివాదంలో ఉందని అధికారులు తేల్చారు. కోర్టు కేసు ఉన్న భూమిలో సంత నిర్వహించడం చట్టవిరుద్ధమని రెవెన్యూ సిబ్బంది చెప్తున్నారు. దీంతో ఏళ్ల తరబడి ఇక్కడ సంతపై ఆధారపడిన రైతులు, కాపరులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా, జార్ఖండ్, బీహార్ వంటి ప్రాంతాల నుంచి కూడా ఇక్కడికి గొర్రెలు, మేకల్ని వ్యాపారులు తీసుకొస్తుంటారు. వీరంతా తమ జీవాలకు ఎక్కడ వసతి కల్పించాలో? ఎలా అమ్ముకోవాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. సరైన స్థలం లేకపోతే తక్కువ ధరకు అమ్మేసుకోవాల్సి వస్తోందని, తీవ్రంగా నష్టపోతామని వాపోతున్నారు.

ప్రభుత్వమే స్పందించాలి

రైతులు, కాపరుల సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వం లేదా కబేళా నిర్వాహకులపై ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ స్థలానికి కొదవలేదని, జీవీఎంసీ ఆధ్వర్యంలో స్టాక్ పాయింట్ ఏర్పాటు చేస్తే ప్రైవేట్ వ్యక్తులకు వెళ్తున్న ఆదాయం జీవీఎంసీకి వస్తుందని సూచిస్తున్నారు. అంతేకాకుండా జీవాలను ఉంచుకునే వారికి రక్షణ, సౌకర్యాలు లభిస్తాయని అంటున్నారు. ఉన్నతాధికారులు ఈ విషయంపై దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని గొర్రెలు, మేకల రైతులు, కాపరులు కోరుతున్నారు.

ఏం చెయ్యాలో తెలియట్లేదు



నేను పాత కబేలా ఉన్నప్పటి నుంచి.. 14 ఏళ్లుగా వ్యాపారం చేస్తున్నాను. గొర్రె/మేక పిల్లల్ని తెచ్చుకోవడం, అమ్మడం వంటివి చేస్తుంటా. మాలాంటి వాళ్ల దగ్గర మరి కొందరు పనిచేస్తున్నారు. ఇలాంటి ఇబ్బందులు ఎప్పుడూ లేవు. ఏం జరుగుతుందో అర్థం కావడంలేదు. కనీస సదుపాయాలు లేవు.

–బద్రి భయా, బరంపురం

అధికారులు స్పందించాలి



మాకు రక్షణే కాదు.. కనీసం లైటింగ్ కూడా లేదు. కొన్నిసార్లు మా జీవాలు ఏమైపోతున్నాయో అర్థం కావట్లేదు. మాతో పాటు ఎంతో మంది ఇక్కడ ఉపాధి పొందుతున్నారు. అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలి. గవర్నమెంట్ స్టాక్ పాయింట్ ఏర్పాటు చేస్తే చాలా వరకు ఇబ్బందులు ఉండవు.

–అందల గణేష్, వ్యాపారి, కురద, ఒడిశా

చర్యలు తీసుకుంటాం



స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాల్సిన బాధ్యత కబేలా నిర్వాహకులపైనే ఉంది. వారు ఏర్పాటు చేయకుంటే తక్షణమే నోటీసులిస్తాం. అవసరం అయితే పోలీసు ఫిర్యాదుకు కూడా వెనుకాడబోం .జీవీఎంసీ అనుమతి లేకుండా ఇక్కడ ఏ రకమైన కార్యకలాపాలు నిర్వహించ కూడదు. తక్షణ చర్యలు తీసుకుంటాము.

–కిషోర్, నగర వెటర్నరీ అధికారి, జీవీఎంసీ

బైక్ స్ప్రాకెట్‌లో చిక్కి తెగిన బాలుడి చేతివేళ్లు


తెగిపోయిన బాలుడి చేతి వేళ్లు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు సంతపేటలో ప్రమాదవశాత్తూ బైక్ చైన్ స్ప్రాకెట్‌లో కుడిచేయి పెట్టడం వలన నాలుగేళ్ల బాలుడు జతిన్‌కు మూడు వేళ్లు తెగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శనివారం బాలుడి తండ్రి బైక్ శుభ్రం చేస్తూ ఇంజిన్ స్టార్ట్ చేశాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న బాలుడు తిరుగుతున్న చైన్ స్ప్రాకెట్‌లో చేయి పెట్టగా వేళ్లు తెగిపోయాయి. వెంటనే తల్లిదండ్రులు బాలుడిని స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. వైద్యుల సూచన మేరకు అత్యవసర చికిత్స నిమిత్తం బెంగళూర్ తీసుకువెళ్లారు.

దేహం శాశ్వతం కాదు


వామనదేవుని అవతారం నాటకంలో ఓ ఘట్టం

కొమ్మాది : బీచ్‌రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ టెంపుల్‌లో ఆదివారం సాయంత్రం నిర్వహించిన వామన దేవుని అవతారం నాటక ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. దక్షిణాఫ్రికా, కెనడా, యూఎస్‌ఏ నుంచి వచ్చిన ప్రతిభావంతులైన భక్తుల బృందం ఈ నాటకాన్ని స్వామి మహారాజ్ (కెనడా) మార్గదర్శకత్వంలో ప్రదర్శించారు. అనంతరం పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ భూమి పై దేహంతో ఉన్న మానవాళికి దేహం శాశ్వతం కాదని ఆ విషయాన్ని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని స్వామి మహారాజ్ అన్నారు. శాశ్వతమైన కృష్ణ ప్రేమ తత్వాన్ని ఎవరైతే పొందగలుగుతారో వారి జీవితం ఆనందదాయకంగా ఉంటుందన్నారు. ఎవరైతే క్రమం తప్పకుండా హరేకృష్ణ మహా మంత్రాన్ని జపిస్తారో వారికి అంతిమంలో మోక్షం కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని, స్వామీజీ వంశీకృష్ణ ప్రభు, వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

సింహగిరిపై పెళ్లి మండపాల కాంట్రాక్ట్ రద్దుకు డిమాండ్

సింహాచలం: సింహగిరిపై పెళ్లిళ్ల కోసం మండపాలను ఇచ్చే కాంట్రాక్ట్ పద్ధతిని పూర్తిగా రద్దు చేయాలని సనాతన ధర్మ పరిరక్షణ సమితి జేఏసీ కన్వీనర్ పూడిపెద్ది శర్మ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. సింహగిరిపై కల్యాణ మండపాలకు కాంట్రాక్టర్ అధిక ధరలు వసూలు చేస్తుండటంతో సాధారణ, మధ్య తరగతి ప్రజలు వివాహాలు చేసుకోలేని పరిస్థితి ఉందన్నారు. దీనిపై గత నెలలో తాము రిలే నిరాహార దీక్ష చేస్తే దేవస్థానం ఏఈవో ఆనంద్‌కుమార్ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి దీక్ష విరమింపజేశారన్నారు. కానీ నెల గడుస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ప్రస్తుతం గడువు తీరిపోయిన కల్యాణ మండపాల కాంట్రాక్ట్ మరింత కాలం పెంచి, దేవదాయశాఖ ఇన్‌చార్జి కమిషనరే ఆర్డర్ ఇవ్వడం వెనుక ఆంతర్యం ఏంటో తెలియడంలేదని ఆక్షేపించారు. హిందూ ఆలయాల్లో జరుగుతున్న దోపిడీలను అరికట్టాల్సిన అధికారులే దోపిడీదారులకు మద్దతుగా నిలుస్తున్నారని విమర్శించారు. వెంటనే దేవదాయశాఖ ఇన్‌చార్జి కమిషనర్ రామచంద్రమోహన్ స్పందించి, పెళ్లి మండపాల కాంట్రాక్ట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. అతి త్వరలోనే కార్యాచరణ, దీక్ష చేసే తేదీని ప్రకటిస్తామని తెలిపారు.

ఫిషింగ్ హార్బర్‌కు పోటెత్తారు


ఖాళీగా చికెన్ సెంటర్.. బారులు తీరిన మటన్ సెంటర్


జనాలతో జాతరను తలపిస్తున్న ఫిషింగ్ హార్బర్

డాబాగార్డెన్స్: కోడి తినలేక.. మటన్ కొనలేక.. నాన్ వెజ్ ప్రియులు ఫిషింగ్ హార్బర్‌కు ఆదివారం పోటెత్తారు. ఇసుకేస్తే రాలనంతగా చేపలు, రొయ్యలు, పీతలు తదితర మత్స్య సంపద కొనుగోలుకు తరలివచ్చారు. ఫిషింగ్ హార్బర్ ప్రాంగణంలో జాతర వాతావరణం నెలకొంది. దీంతో చేపలు విక్రయించే మత్స్యకారులు అమాంతగా రేట్లు పెంచేశారు. ఉదయం 6 నుంచి సాయంత్రం పొద్దుపోయే వరకు ఈ రద్దీ కొనసాగింది. ఓ వైపు నగరవాసులే గాక.. పర్యాటకులు కూడా ఫిషింగ్ హార్బర్‌కు పెద్ద ఎత్తున తరలిరావడంతో కిక్కిరిసింది. వాహనాల రాకపోకలకు కొంత మేర అంతరాయం ఏర్పడింది.

23 తులాల బంగారం, రూ.లక్ష చోరీ


దొంగలు విరగ్గొట్టిన ఇంటి గెడ

సీతమ్మధార: ఇంట్లో చొరబడి 23 తులాల బంగా బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు చోరీ ఘటన మధురానగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు మీడియాకు ఆదివారం తెలిపిన వివరాలు.. మధురానగర్ జీవీఎంసీ పాఠశాల దరి అనంతమాధవి టవర్స్, ఫ్లాట్ నెం.102లో మరకాని కృష్ణ(46) కుటుంబంతో కలిసి ఏడేళ్లుగా నివాసం ఉంటున్నారు. కృష్ణ నగరంలోని అశోక్ ఆటోమొబైల్స్‌లో పనిచేస్తున్నారు. శనివారం కుటుంబంతో కలిసి కాకినాడలో బంధువుల ఇంటికి వెళ్లారు. ఆదివారం ఉదయం తిరిగి వచ్చేటప్పటికి ఇంటికి వేసి ఉన్న తాళం కట్ చేసి ఉండటాన్ని గమనించారు. దీంతో కంగారుగా ఇంట్లోకి వెళ్లి చూడగా.. బీరువాలో ఉన్న 23 తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ.లక్ష నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. దీంతో బాధితులు ద్వారకా క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంతో సంఘటనా స్థలికి చేరుకుని, ఆధారాలు సేకరించారు. సీసీ ఫుటేజ్‌లో నిందితుడిని గుర్తించి, పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

నింగి నీలమంతా సంద్రమే..


నింగి నీలం నేల జారకుండా.. తన మేనికి అద్దుకున్న సంద్రం. ఆ సంద్రం చెంతన.. అలల మధ్యే మత్స్యకారుల ఆశల మోసులెత్తే పడవలు.. తీరానికి కొత్త వన్నెలద్దాయి. వేటలేని సమయంలో పెదజాలారిపేట తీరంలో లంగరు వేసిన పడవలు ఇలా సాక్షి కెమెరాకు చిక్కాయి.

– ఏయూ క్యాంపస్

–ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

'గ్రాండ్'తో గందరగోళం..!


అడవివరం జెడ్పీ హైస్కూల్లో పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు


తరగతి గదిలో విద్యార్థినులు

- నేటి నుంచి టెన్త్ విద్యార్థులకు గ్రాండ్ టెస్ట్‌లు
- ఈ నెల 17 నుంచి వార్షిక పరీక్షలు

విశాఖ విద్య: పదో తరగతి వార్షిక పరీక్షలకు ముందు గ్రాండ్ టెస్ట్‌ల పేరుతో పాఠశాలల్లో చేస్తోన్న హడావుడి విద్యార్థులను గందరగోళానికి గురిచేస్తోంది. సోమవారం నుంచి ఈ నెల 13 వరకు టెన్త్ విద్యార్థులకు గ్రాండ్ టెస్ట్‌లు నిర్వహించేలా పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు షెడ్యూల్ జారీ చేశారు. ఈ నెల 17 నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇటీవలనే ప్రీ ఫైనల్ పరీక్షలు ముగిశాయి. అందులో విద్యార్థుల ప్రోగ్రెస్‌పై స్కూళ్లలో ఎటువంటి సమీక్ష లేదు. ఇంతలోనే గ్రాండ్ టెస్ట్‌లు పెట్టాలని ఉన్నతాధికారులు ఆదేశాలివ్వటం విద్యార్థులను టెన్షన్‌కు గురిచేసినట్లేనని ఉపాధ్యాయులు అంటున్నారు.

ప్రిపరేషన్‌కు సమయమేదీ?

సమ్మెటివ్-1, సమ్మెటివ్-2లో సాధించిన మార్కులను ప్రాతిపదికగా తీసుకుని ఏ సబ్జెక్టులో విద్యార్థులు వెనుకబడ్డారనేది గుర్తించి, అందుకనుగుణంగా వారిని వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాల్సి ఉంది. కానీ సోమవారం నుంచి రోజుకో సబ్జెక్టు చొప్పున ఈ నెల 13 వరకు గ్రాండ్ టెస్ట్‌లను విద్యార్థులు రాయాల్సి ఉంది. దీంతో వెనుకబడిన సబ్జెక్టు ప్రిపరేషన్‌కు సమయం లేకుండా పోతుందని, ఇది విద్యార్థుల వార్షిక పరీక్షలపై ప్రభావం చూపే అవకాశం ఉందని టీచర్లు ఆక్షేపిస్తున్నారు.

టెన్షన్లో విద్యార్థులు

వార్షిక పరీక్షల మాదిరే, ప్రశ్నా పత్రాలను కట్టుదిట్టమైన భద్రత నడుమ ఏ రోజుకారోజు వాటిని విద్యార్థులకు అందించి, గ్రాండ్ టెస్ట్‌లను నిర్వహించాలని అధికారులు సూచించారు. ఇందుకోసం మండల స్థాయిలో త్రీమెన్ కమిటీలను ఏర్పాటు చేశారు. గ్రాండ్ టెస్ట్ షెడ్యూల్‌లో భాగంగా ఈ నెల 13న సోషల్ స్టడీస్ పరీక్ష రాయాల్సి ఉంది. దానికి హాజరైన విద్యార్థి మూడు రోజుల వ్యవధిలో(17న) వార్షిక పరీక్షలకు సిద్ధం కావాలి. వార్షిక పరీక్షల ముందు టెన్త్ విద్యార్థులను టెన్షన్‌కు గురిచేసేలా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆదరించి బతుకునిచ్చావ్.. ఇక సెలవ్!



36 ఏళ్ల వృత్తి జీవితాన్నిచ్చావ్. సమాజంలో గుర్తింపు, కుటుంబంలో గౌరవం, పిల్లలకు బంగారు భవిష్యత్తునిచ్చేంత ఆర్థిక భరోసానిచ్చావ్. నీతో వృత్తి బంధం ముగిసినా.. నా బ్రతుకులో ఇప్పటి వరకు గడిపిన, ఇక మీదట గడిపే ప్రతి క్షణం నీవిచ్చిన జ్ఞాపకాలే.. అనుకుంటూ విశాఖ ఉక్కు కర్మాగారానికి ఓ కార్మికుడు కన్నీటితో వీడ్కోలు పలికాడు. స్టీల్‌ప్లాంట్ ఇంజినీరింగ్ షాప్స్ అండ్ ఫౌండ్రీ విభాగం జనరల్ ఫోర్‌మన్ వై.సుధాకర్‌కు 60 ఏళ్లు పూర్తికావడంతో పదవీ విరమణ చేశాడు. ఇన్నాళ్లూ కలిసి పనిచేసిన ఉద్యోగులు ఆయనకు ఘన సన్మానం చేశారు. అనంతరం కుటుంబంతో సహా బయటకు వచ్చిన సుధాకర్ ఉద్వేగానికి గురయ్యాడు. తల్లిలాంటి స్టీల్‌ప్లాంట్‌ను వీడి వెళ్లడం బాధగా ఉందంటూ.. ప్లాంట్ ముఖద్వారం వద్ద సాష్టాంగ నమస్కారం చేస్తూ కన్నీటి పర్యంతమయ్యాడు.

– ఉక్కునగరం

సాక్షి క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, GUTTIKONDA ROJARANI (New Name) W/o. TATHIPARTHI BALAJI, previously called as TATHIPARTHI ROJARANI (Old Name) resident of Flat No. 8077, MVV City, Opp.YSR Cricket Stadium, PM Palem Madhurawada, Visakhapatnam -530041, Andhra Pradesh. Now changed my name from TATHIPARTHI ROJARANI (Old Name) to GUTTIKONDA ROJARANI (New Name) Henceforth I will be called as GUTTIKONDA ROJARANI (New Name) for all the purposes.

CHANGE OF NAME & DATE OF BIRTH

1, No 15325161Y NK Sudhakar Vadlamani S/o Vadlamani Venkateswara Rao Resident of Door No: 65-6-514, Himachal Nagar, Post: New Gajuwaka, Tahsil/District: Visakhapatnam, PIN - 530 026, State: Andhra Pradesh have declared my Father name from Venkateswara Rao V to VADLAMANI VENKATESWARA RAO and date of birth 01 Jul 1951 to 04 Feb 1954 vide affidavit Ser No - IN-AP69689862517262X dated 27 Feb 2025 before Special Magistrate of Visakhapatnam (Andhra Pradesh) for all purpose.

CHANGE OF NAME & DATE OF BIRTH

1, No 15325161Y NK Sudhakar Vadlamani S/o Vadlamani Venkateswara Rao Resident of Door No: 65-6-514, Himachal Nagar, Post: New Gajuwaka, Tahsil/District: Visakhapatnam, PIN - 530 026, State: Andhra Pradesh have declared my Mother name from Mina Kumari to VADLAMANI MEENAKUMARI and date of birth 01 Jul 1955 to 05 Jun 1957 vide affidavit Ser No IN-AP69689734094485X dated 27 Feb 2025 before Special Magistrate of Visakhapatnam (Andhra Pradesh) for all purpose.

Real Estate

PLOT FOR SALE

■ తగరపువలస, భోగాపురం శుభగృహ వారి సుకృతి సాన్వి వెంచర్‌లో VMRDA, RERA అప్రూవ్ ప్లాట్స్ కలవు. గ॥ 13 వేలు, 11 వేలు, యాక్సిస్ బ్యాంక్ సౌకర్యం కలదు. ఫోన్ : 99638 41555 [V- 12360]

LOSS OF PASSPORT

I, VISAKH VARMA V, S/o. Ravivarmaraja Vinayavarmaraja, Resident of D.No. 4, Chitra, Naval Park, Visakhapatnam - 530014, A.P., I have lost my Original passport bearing No: E2346662, While travelling from Scindia Junction to Visakhapatnam City. If anybody finds it please contact me : 89859 93902

Services

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 13197]

■ వైజాగ్‌లో (బస్టాండ్‌కు దగ్గరలో) రెస్టారెంట్ నందు ఆయాలు, రిసెప్షనిస్ట్, వెయిటర్స్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సంప్ర॥ ✆ 8142997766. [B-755670]

■ త్రినేత్ర హోంకేర్‌నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి+భోజనం. జీ :18K. , Ph : 8520980099, 8520874499 [HA-1902]

■ MS Pvt Ltd నందు టెలి కాలింగ్ చేయుటకు మేల్/ఫీమేల్ కావలెను. పార్ట్ టైమ్/ఫుల్ టైమ్, Qly: 10th, జీతం : 16000 to 18000, Ph: 9550853907 [HA-1195]

Wanted

■ Urg. Req. For Pvt. Ltd. Company Qualf : Dip. / Degree in Civil Eng., Auto Cad 2D & 3D with Good Knowledge at Yandada. Ph : 79890 60925, 98663 50824 [V-12359]

■ వైజాగ్ మద్దిలపాలెం పరిసరాల్లో Flipkart ప్రొడక్ట్స్ డెలివరీ చేయడానికి డెలివరీ బాయ్స్ కావలెను. కమిషన్ పరంగా 25,000 వరకు సంపాదించుకోవచ్చు ✆ : 09573840437, 09133381333 [R-7361]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

మురళీనగర్, మాధవధార	90101 33346
NAD, కంచరపాలెం	90108 10033
గోపాలపట్నం, పెందుర్తి	70759 89701
సీతమ్మధార, ద్వారకానగర్	90100 55116
డాబాగార్డెన్స్, జగదాంబ / MVP కోలనీ, మద్దిలపాలెం	90101 96663
రాజువాక	97059 33394

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం